క్లుప్తంగా

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



తాటితూరు కూడలిలో సిద్ధం చేసిన మండపం

తగరపువలస: ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞాన వేదిక తాటితూరు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం నుంచి 11 రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందు కోసం భీమిలి మండలం తాటితూరు కూడలిలో నిర్వాహకులు మండపం సిద్ధం చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం పూజల తోపాటు సాయంత్రం వేళ మండపం వద్ద భగవద్గీత సారాంశాన్ని తెలిపే ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వేదిక ప్రతినిధి రావణ అక్షయ్ తెలిపారు. చివరి రోజు 16న పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ 11 రోజుల కార్యక్రమానికి కృష్ణ భగవానుని భక్తులంతా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తాగునీటి సరఫరాకు నేటి నుంచి అంతరాయం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో గ్లాస్ రీయిన్‌ఫోర్స్ కాంక్రీట్ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా బుధ, గురువారాల్లో భీమిలి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టి.ఎల్.సుధాకర్ తెలిపారు. తగరపువలస గోస్తనీనది కొండపేట పంపింగ్ స్టేషన్ నుంచి భీమిలి పట్టణంలో 450 కేఎల్, 800 కేఎల్ రిజర్వాయర్లకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పలుచోట్ల మరమ్మతులకు గురయ్యింది. ఈ కారణంగా రెండు రోజులు భీమిలి పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి కోసం డి.హరి (63003 89896), త్రినాథ్ (98660 46100)ను సంప్రదించాలని ఏఈ సుధాకర్ సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అంకాలజిస్టు వంశీధర్

పద్మనాభం: మహిళల్లో 40 ఏళ్లు దాటిన వారికి క్యాన్సర్ రావచ్చని బృంద ఆస్పత్రి అంకాలజిస్టు వంశీధర్ అన్నారు. కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గ్రామీణ వైద్యులకు క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎనిమిది నుంచి 14 ఏళ్ల వయస్సు మధ్యలో క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ ఉందన్నారు. మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఆర్.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, మండల కమిటీ సభ్యులు తాతబాబు, రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి 'రెడ్ క్రాస్' అంత్యక్రియలు

ఎంవీపీకాలనీ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి 17వ వార్డులోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలివి.. ఆగస్టు 30వ తేదీన నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని సొసైటీ ప్రతినిధులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో జాయిన్ చేశారు. ఆయనకు ఎవరూ లేరని తెలియడంతో తామే సేవలందించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆ వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఈ నెల 4వ తేదీన మరణించారు. కేజీహెచ్ సీఎస్‌ఆర్‌ఎం అందించిన సమాచారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆ వ్యక్తి శవానికి పంచనామా పూర్తి చేయించారు. అనంతరం మృతదేహాన్ని జ్ఞానాపురంలోని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళి పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు





చంద్రంపాలెం హైస్కూల్‌లో హెచ్‌ఎం రాజబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గురువే ప్రత్యక్ష దైవం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: గురువు ప్రత్యక్ష దైవమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోని 22 పాఠశాలలకు చెందిన 170 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విద్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటే ఎంతో అభిమానమన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో విద్యాభివృద్ధికి రూ.50 వేల కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీవీఎంసీ మధురవాడ జోన్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, చంద్రంపాలెం పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గాదే రోశిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల సేవలు కీలకం

భీమునిపట్నం: సమాజంలో ఉపాధ్యాయులు అందించే సేవలు ఎంతో కీలకమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో భీమిలి మండల, జోన్ పరిధిలోని 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ముందుగా ఆవరణలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సమాజంలో ఎలా జీవించాలో నేర్పడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. అందువల్లే పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు శత



భీమిలిలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి, ఎంఈవో శివరాణి, ఎంపీడీవో వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొమ్మాది/పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్, మంగమారిపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గీతం ప్రాంగణంలో వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి నివాళులర్పించారు. లక్ష్మివానిపాలెంలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరసవల్లి లక్ష్మి గురువుల ప్రాముఖ్యతను వివరించారు.

తగరపువలస: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం భీమిలిలోని పలు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. భీమిలి కేథరిన్ విద్యా సంస్థల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీరిని చైర్మన్ ఆలీవర్ రాయి, డైరెక్టర్ ఇవాంజలిన్ రాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కె.నాయుడు అభినందించారు. బొగ్గురోడ్డులోని చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్‌లో చైర్మన్ అనుపమ జ్యోతిర్మయి, డైరెక్టర్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకం

ఆనందపురం : సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గురుపూజోత్సవం సందర్భంగా 80 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలను ప్రభావితం చేసే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. విద్యతోనే వ్యక్తిత్వ వికాసం మెరుగు పడుతుందని చెప్పారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, బొట్టా రామకృష్ణ, పిన్నింటి వెంకట రమణ, కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

- బోని గ్రామంలో 30 మంది ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్‌లు బోని అప్పలకొండ, కర్రి నాయుడుబాబు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.
- ఆనందపురం హైస్కూల్‌లో సంఘ సేవకుడు కొట్యాడ సత్యమూర్తి, వేములవలసకు చెందిన చందక సూరిబాబు ఆధ్వర్యంలో 43 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 30 సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా సేవలు అందించిన సిస్టర్ స్టెన్స్‌లెస్‌ను సీబీఎం, బీజీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల వద్ద సత్కరించారు. కరస్పాండెంట్ పి.ఎ.విజయకుమారి మాట్లాడుతూ తాను ఈమె వద్దే చదువుకుని... ఇప్పుడు ఆమెను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశ్రాంత ఎంఈవో సాయిబాబా, పి.ఎస్.చంద్, పీజీకే వర్మ పాల్గొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

జ్ఞాన బోధకులు ఉపాధ్యాయులు

పద్మనాభం: ఉపాధ్యాయులు జ్ఞాన బోధకులని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. విలాస్కాన్‌పాలెంలో మంగళవారం రాత్రి విశ్రాంత ఎంఈవో ఎం.రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు మొకర అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, గొండెల నారాయణ, కాళ్ల సూర్యనారాయణతోపాటు 280 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, సర్పంచ్ నల్లి.సత్యవతి, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.



శారద పబ్లిక్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు



ఆనందపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ సేవకులు



బోనిలో సత్కారాలు పొందిన ఉపాధ్యాయులు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఓటర్ల జాబితాల పరిశీలన పూర్తి



సమావేశంలో ఆర్‌డీవో భాస్కర రెడ్డి, తదితరులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇంటింటికీ బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు వెళ్లి ఓటర్ల జాబితా సరిచూశారన్నారు. అవసరమైన చోట తొలగింపులు, కొత్తవి నమోదు చేశారని తెలిపారు. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. అలాగే 1,500 మంది ఓటర్లు దాటితే అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్‌తోపాటు ఇతర సిబ్బంది పరిశీలిస్తున్నారని, అవసరమైన చోట కొత్త కేంద్రాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.వేణుగోపాల్, నాయకులు గంటా నూకరాజు, చంద్రరావు, కదిరి జగన్నాథం పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో తుప్పల తొలగింపు



ఆదర్శనగర్‌లో తుప్పలు తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో మంగళవారం బాబ్‌కాట్‌తో తుప్పలు తొలగించి శుభ్రత చర్యలు చేపట్టారు. 'సమస్యల నిలయంగా ఆదర్శనగర్' శీర్షికతో సోమవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. నివాసాల మధ్య మురుగు ఉండిపోయినందున ఇక్కడ డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే 'వీధి దీపం వెలగక అవస్థలు' శీర్షికతో సోమవారం ప్రచురించిన మరో వార్తకు కూడా అధికారులు స్పందించి సంతపేట రెడ్డివీధిలో వీధి దీపాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కారం కావడంతో ఆదర్శనగర్, సంతపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి



తాటితూరు పొలంలో రైతులతో వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో మంగళవారం వరిలో సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి ఏడీఏ చదువుల సుబ్రహ్మణ్యం, ఏవో సీహెచ్ సురేష్ మాట్లాడుతూ వరి సాగులో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, కలుపు నివారణపై రైతుల సందేహాలు తీర్చారు. సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సాగులో పెనుభారంగా మారిన కూలి ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఊడుపులు, కలుపు తీత, కోతల సమయంలో యంత్రాల ఆవశ్యకతను తెలియజేశారు. డ్రోన్‌లు వినియోగించి పురుగు మందుల పిచికారీపై అవగాహన కలిగించారు. భీమిలి ఏడీఏ విజయప్రసాద్ రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించుకోవడంపై వివరించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. భీమిలి ఏవో బి.శివకోమలి, వీఏఏ స్వాతి పాల్గొన్నారు.

నృత్య కళాకారిణికి సత్కారం



నృత్య కళాకారిణి కృష్ణవేణిని సత్కరిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇక్కడి కృష్ణ కూచిపూడి కళాక్షేత్ర వ్యవస్థాపకురాలు, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్న కృష్ణవేణిని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సదర్భంగా డాక్టర్ కాళ్ల లావణ్య, ఇతర సభ్యులు సత్కరించి జ్ఞాపికతోపాటు, రూ.10 వేలు అందించారు. అనంతరం ఫ్యాబ్ ప్రతినిధి ముసునూరి సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ కూచిపూడి కళను ఈ ప్రాంతంలో వ్యాపింపజేసేందుకు కృష్ణవేణి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమె శిక్షణలో అనేక మంది పిల్లలు ప్రతిభ చూపుతూ గుర్తింపు పొందుతున్నారని తెలిపారు. కాళ్ల సన్నీ, కట్టమూరి రమణారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీకృష్ణాష్టమి వేడుక



కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

భీమునిపట్నం: స్థానిక కీతిన్‌పేట సమీపంలోని సన్ స్కూల్ వద్ద మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, బలరాముడు, యశోద, గోపికలు, రాధ వేషధారణతో కోలాటమాడారు. స్కూల్ డైరెక్టర్ కై తపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షక పంటలతో తెగుళ్ల నివారణ

పద్మనాభం: రక్షక పంటలు సాగు చేయడం వల్ల ప్రధాన పంటలకు తెగుళ్లు సోకకుండా ఉంటాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు సూచించారు. మండలంలోని పొట్నూరులో ఏటీఎం నమూనా కింద మంగళవారం రైతు శాస్త్రవేత్త సురేష్ పొలంలో మోడల్‌గా దుంప, తీగ, ఆకు కూరలు, పండ్లతోటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మోడల్‌లో రక్షక పంటగా మొక్కజొన్న, ఎర పంటగా బంతి వేశామన్నారు. వీటి వల్ల ప్రధాన పంటలకు తెగుళ్లు సోకకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అసోసియేట్లు నాయుడు, చక్రవర్తి, మెంటార్ పద్మజ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



రోడ్డును చదును చేస్తున్న జేసీబీ

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కే1, కే2, కే3 కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ఇటీవల ఇక్కడ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు స్థానిక కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక ద్వారా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించడంతో రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయని కాలనీ అధ్యక్షుడు అవతార్ సింగ్ తెలిపారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జంక్‌ఫుడ్ చేటు.. పౌష్టికాహారమే మేలు



పోటీల విజేతలతో మ్యాజిక్ బస్ ప్రతినిధులు

తగరపువలస: జంక్‌ఫుడ్ ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని హరిస్తుందని, పౌష్టికాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జీవీఎంసీ సంతపేట అంబేడ్కర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథస్వామి అన్నారు. మంగళవారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్‌లో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. జంక్‌ఫుడ్ వల్ల చిన్నారుల శరీర ఆకృతి వికృతంగా మారుతుండడమే కాకుండా ఇమ్యూనిటీ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు పౌష్టికాహార పోటీలు నిర్వహించి ఎక్కువ పోషకాలతో వంటలు సిద్ధం చేసిన తల్లులకు స్టీల్ బిందెలు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ లంచ్ బాక్స్‌లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నంనాయుడు, శ్రీను, మ్యాజిక్ బస్ మోనిటరింగ్ అధికారి దూడ రమేష్, ప్రతినిధులు శారద, రమ్య, సుజాత, గౌరీ శిరీష, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తగరపువలస: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11.50 సమయంలో అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన దార్ల రాజేష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజేష్ మూడేళ్ల క్రితం తగరపువలసలోని తన మేనత్త ఎండపల్లి చిన్నమ్మలు ఇంటికి వచ్చి కార్పెంటర్ పనులు నేర్చుకుంటూ ఉంటున్నాడు. గత నెల 31న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజేష్‌ను మేనత్త మందలించింది. దీంతో కోపం తెచ్చుకున్న రాజేష్ తగరపువలస బంకులో పెట్రోల్ కొనుక్కుని సీసాతో ఇంటికి తెచ్చుకున్నాడు. మేనత్త ముందే పెట్రోల్ పోసుకుని అంటించుకోవడంతో శరీర భాగాలు కాలిపోయాయి. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని అన్నయ్య మణికంఠ ఫిర్యాదు మేరకు కేసును భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

పద్మనాభం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని విలాస్కాన్‌పాలెంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మతో కలిసి మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా నిరుద్యోగులు విజ్ఞానం సముపార్జించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ విలాస్కాన్‌పాలెం గ్రామంలో గ్రంథాలయ భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 158 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ నల్లి సత్యవతి, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు, నల్లి సన్యాసప్పడు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.